# హర్మన్ డబుల్

- పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం
- ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ



హులున్‌బుయిర్(చైనా): ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు వరుస విజయాలతో దూసుకెళుతున్నది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఇప్పటికే సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకున్న టీమ్‌ఇండియా..తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1తో దాయాది పాకిస్థాన్‌పై విజయదుంధుభి మోగించింది. తద్వారా టోర్నీలో వరుసగా ఐదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మరోవైపు టోర్నీలో ఇప్పటి వరకు అపజయమెరుగని పాక్..భారత్ చేతిలో తొలి ఓటమి ఎదుర్కొంది. భారత్ తరపున కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్(13ని, 19ని) డబుల్ గోల్స్‌తో అదరగొట్టగా, అహ్మద్ నదీమ్(8ని) పాక్‌కు ఏకైక గోల్ అం దించాడు. 2016 నుంచి పాక్‌పై తమ అప్రతిహత విజయాలతో ఆకట్టుకుంటున్న టీమ్‌ఇండియా అదే పరంపరను కొనసాగించింది. గతేడాది హంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా గేమ్స్‌లో 10-2తో భారీ విజయం సాధించిన భారత్..చెన్నైలో ఏసీటీ టోర్నీలోనూ 4-0తో చిత్తు చేసింది.

**ఆది నుంచే జోరు:**

చిరకాల ప్రత్యర్థుల మధ్య పోరు ఆరంభం నుంచే ఆకట్టుకుంది. మ్యాచ్ మొదలైన తొలి నిమిషం నుంచే ఇరు జట్ల ప్లేయర్లు గోల్ లక్ష్యంగా ముందుకు కదిలారు. బంతిని తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించారు. అయితే మ్యాచ్ 8వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ హన్నన్ షాహిది అందించిన పాస్‌ను నదీమ్ ఫీల్డ్ గోల్‌గా మలువడంతో పాక్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. వెంటనే తేరుకున్న భారత ఎదురుదాడికి దిగింది. పాక్ గోల్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మన దళాలు చురుకుగా ముందుకు కదిలాయి. ఆరు నిమిషాల తేడాతో దక్కిన రెండు పెనాల్టీ కార్నర్లను స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్‌సింగ్ గోల్స్ చేయడంతో భారత్ ఆధిక్యం 2-1కి పెరిగింది. హర్మన్ కొట్టిన పవర్‌ఫుల్ షాట్లను అడ్డుకోవడంలో పాక్ గోల్‌కీపర్ మునీబ్ విఫలమయ్యాడు. అయితే స్కోరును సమం చేసేందుకు పాక్ ప్లేయర్లు ఎంతగా ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. రెండో క్వార్టర్ ముగుస్తుందనగా దక్కిన పెనాల్టీ కార్నర్‌ను పాక్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. కీలకమైన చివరి క్వార్టర్‌లో భారత్‌కు మూడు పెనాల్టీ కార్నర్లు దక్కినా..గోల్స్‌గా మలువలేకపోయింది. ఇదిలా ఉంటే హర్మన్‌ప్రీత్‌కు పాక్ ప్లేయర్ అష్రాఫ్ వహీద్‌కు మధ్య మాటల తూటాలు పేలాయి. జుగ్‌రాజ్‌సింగ్‌ను వహీద్ దురుసుగా అడ్డుకోవడంతో 10 నిమిషాల పాటు సస్పెన్షన్‌కు గురయ్యాడు.

**3**

అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌ల్లో భారత్ తరపున అత్యధిక గోల్స్ చేసిన మూడో ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్‌సింగ్(203) నిలిచాడు. ధ్యాన్‌చంద్(570), బల్బీర్ సింగ్ (246) ముందువరుసలో ఉన్నారు.






## లివింగ్‌స్టోన్ విజృంభణ

**ఆసీస్‌పై ఇంగ్లండ్ విజయం**

కార్డిఫ్: ఆస్ట్రేలియాతో రెండో టీ20లో ఇంగ్లండ్ హార్డ్‌హిట్టర్ లియామ్ లివింగ్‌స్టోన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆఖరి వరకు ఆసక్తికరంగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 3 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. కంగారూలు నిర్దేశించిన 194 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ మరో ఓవర్ మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. 79 పరుగులకే విల్‌జాక్స్(12), జోర్డాన్(0), కెప్టెన్ ఫిల్‌సాల్ట్(39) వికెట్లు చేజార్చుకున్న ఇంగ్లండ్‌ను లివింగ్‌స్టోన్(87) ఆదుకున్నాడు. ఆసీస్ బౌలింగ్ దాడిని సమర్థంగా తిప్పికొడుతూ నాలుగో వికెట్‌కు జాకబ్ బెతెల్(44)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరు కలిసి 90 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షార్ట్(5/22) ఐదు వికెట్లతో రాణించాడు. అంతకుముందు ఆసీస్.. జేక్ ఫ్రెజర్(50), ఇంగ్లిస్ (42) ఆకట్టుకోవడంతో 20 ఓవర్లలో 193/6 స్కోరు చేసింది. బ్రైడన్ కార్స్(2/26), లివింగ్‌స్టోన్(2/16) రెండేసి వికెట్లు తీశారు. అర్ధసెంచరీతో జట్టును గెలిపించిన లివింగ్‌స్టోన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 ఆదివారం జరుగుతుంది.

## జాతీయ హాకీ జట్టులోకి జ్యోతి

**ప్రాబబుల్స్‌కు ఎంపికైన రాష్ట్ర యువ ప్లేయర్**



బెంగళూరు: జాతీయ క్యాంప్ కోసం ఎంపిక చేసిన భారత హాకీ జట్టు ప్రాబబుల్స్‌లో తెలంగాణ యువ ప్లేయర్ ఈదుల జ్యోతిరెడ్డి చోటు దక్కించుకుంంది. స్వదేశం వేదికగా వచ్చే నెల 11 నుంచి మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ సన్నాహకాల్లో భాగంగా 33 మందితో కూడిన జట్టును హాకీ ఇండియా(హెచ్ఐ) శనివారం ప్రకటించింది. బెంగళూరులోని జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ఆదివారం నుంచి అక్టోబర్ 9 వరకు క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఇందులో మెరుగైన ప్రదర్శన కనబరిచిన వారితో తుది జట్టును ఎంపిక చేయనున్నారు. ఇదిలా ఉంటే జాతీయ హాకీ జట్టుకు ఎంపికైన జ్యోతిరెడ్డిని శనివారం సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సాట్స్ నుంచి పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు.

## సాబ్లెకు నిరాశ

**3000మీ స్టిపుల్‌చేజ్‌లో 9వ స్థానం**



బ్రస్సెల్స్: ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్‌లో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లెకు నిరాశే ఎదురైంది. శుక్రవారం అర్ధరాత్రి(భారత కాలమానం ప్రకారం) జరిగిన పురుషుల 3000 మీటర్ల స్టిపుల్‌చేజ్‌లో సాబ్లె తొమ్మిదో స్థానంలో నిలిచాడు. శుక్రవారం 30వ పడిలోకి ప్రవేశించిన సాబ్లె తన రేసును 8:17: 09 సెకన్ల టైమింగ్‌తో పేలవ ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 10 మంది రేసర్లు పోటీపడ్డ రేసులో కెన్యాకు చెందిన అమోస్ సెరెమ్ (8:06:90సె), సోఫైన్ ఎల్ బకాలీ (8:08:60సె), అమిన్ జినాహ్ (8:09:68సె) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లోనూ సాబ్లె స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడంలో విఫలమై 11వ స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే.

## తిలక్‌వర్మ శతక జోరు

**ఇండియా 'ఏ' రెండో ఇన్నింగ్స్ 380/3 డిక్లేర్డ్**



అనంతపూర్: దులీప్ ట్రోఫీలో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. దేశవాళీలో సత్తాచాటి జాతీయ జట్టులో చోటు ఆశిస్తున్న ప్లేయర్లు అదరగొడుతున్నారు. ఇండియా-'డీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా 'ఏ' బ్యాటర్లు హైదరాబాదీ తిలక్‌వర్మ(193 బంతుల్లో 111 నాటౌట్, 9ఫోర్లు), ఓపెనర్ ప్రథమ్ సింగ్(189 బంతుల్లో 122, 12ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీలతో కదంతొక్కారు. వీరిద్దరి విజృంభణతో ఇండియా 'ఏ' రెండో ఇన్నింగ్స్‌లో 380/3 వద్ద డిక్లేర్ చేసింది. తిలక్, ప్రథమ్ కలిసి రెండో వికెట్‌కు 104 పరుగులు జోడించారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇండియా 'డీ' వికెట్ కోల్పోయి 62 పరుగులు చేసింది. రికీ భుయ్(44), యశ్ దూబే(15) క్రీజులో ఉన్నారు.

**ఆదుకున్న అభిమన్యు:** ఇండియా 'సీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా 'బీ' ఎదురీదుతున్నది. సహచరులు విఫలమైన చోట కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(143 నాటౌట్) అజేయ సెంచరీతో ఆదుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 124తో మూడో రోజు ఆట కొనసాగించిన ఇండియా'బీ' వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ముషీర్‌ఖాన్ (1), సర్ఫరాజ్‌ఖాన్(16), రింకూసింగ్ (6), నితీశ్‌కుమార్‌రెడ్డి(2), సుందర్ (13) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అయినా వెనుకకు తగ్గని ఈశ్వరన్..జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. చేతిలో మూడు వికెట్లు ఉన్న ఇండియా 'బీ' 216 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది.



*మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ వేదికగా శనివారం జరిగిన ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్‌ఎల్)లో చెన్నై టర్బో రైడర్స్ డ్రైవర్ జాన్ లాంకస్టర్ విజేతగా నిలిచాడు. గాబ్రియెలా జిల్కోవ, రుహాన్‌న అల్వా..రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు. ఫార్ములా-4లో జాడెన్ పరియత్(బెంగళూరు స్పీడ్‌స్టర్స్) పోడియం ఫినిష్ చేశాడు.*

## అర్జున్ అదుర్స్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ అదరగొడుతున్నాడు. నాల్గో రౌండ్‌లో భాగంగా సెర్బియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంలో అర్జున్ కీలకమయ్యాడు. అలెక్సీ సరనాతో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకోగా, తనపై పెట్టుకున్న ఆశలను వమ్ముచేయని అర్జున్..ఇండిచ్ అలెగ్జాండర్‌ను ఓడించి వరుసగా నాలుగో విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు విదిత్ గుజరాతి, గుకేశ్ విజయాలతో భారత్ 3.5-0.5 తేడాతో సెర్బియాపై గెలిచింది.

## • కోహ్లీ, రాధిక సెల్ఫీ



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, ప్రముఖ సినీ యాక్టర్ రాధికా శరత్‌కుమార్ సెల్ఫీ అభిమానులను ఆకట్టుకుంటున్నది. లండన్ నుంచి చెన్నై వెళ్తున్న విమానంలో కోహ్లీని కలుసుకున్న రాధిక ఆరాధ్య క్రికెటర్‌పై తన ఇష్టాన్ని చాటుకుంటూ ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.